# మైత్రేయి-యాజ్ఞవల్క్యుడు

డా. శ్రీధరబాబు

**యాజ్ఞవల్క్యమహర్షికి** మైత్రేయి, కాత్యాయని అనేవారు ఇద్దరు భార్యలు. వారిద్దరిలో మైత్రేయి సత్యాన్వేషిణి, బ్రహ్మవాదిని. బ్రహ్మవాదినులందరిలాగే ఆమెకూ బ్రహ్మను గురించి చర్చించడం అన్నా, దానిని ధ్యానించడం అన్నా అమితమైన ప్రీతి. కాత్యాయని సామాన్య సాంసారిక స్త్రీ. ఆమెకు లౌకిక విషయాల లంపటం ఎక్కువ. నిరంతరం గృహకృత్యాలలో, పనిపాటలలో మునిగి తేలుతూ ఉండేది.

చాలాకాలం సాంసారిక జీవితం గడిపిన తర్వాత యాజ్ఞవల్క్యుడు సన్యసించాలని సంకల్పించాడు. అతడు మైత్రేయిని పిలిచి, "మైత్రేయీ! నేను ఈ సంసారాన్ని త్యజించాలనుకొంటున్నాను. సన్యాసం స్వీకరించాలని సంకల్పం కలిగింది. అన్ని సాంసారిక బంధాలనుంచి నేను విముక్తి పొందాలి. నేను ఇంటిని విడిచి అరణ్యాలకు నిష్క్రమించాలి. వెళ్ళేముందు నీకూ, కాత్యాయనికీ ఆస్తినంతా పంచితే నా బాధ్యత తీరుతుంది" అని చెప్పాడు.

మైత్రేయిది ఆధ్యాత్మిక జిజ్ఞాస కలిగిన హృదయం. ఈ ఏర్పాటు ఆమెకు ఏమాత్రం నచ్చలేదు. ఆమె భర్తతో ఇలా అన్నది: "నాథా! మీరు ఆస్తిని గురించి, భాగాలు పంచటాన్ని గురించి మాట్లాడుతున్నారు. ధనధాన్యరాసులూ, యావత్ప్రపంచం నాదైనా నాకేమైనా ఒరుగుతుందా? దానివల్ల అమృతత్వం లభిస్తుందా? దుఃఖాలనుంచి పూర్తిగా విముక్తి లభిస్తుందా?"

మహర్షి ఇలా సమాధానం చెప్పాడు: "లభించదు, మైత్రేయీ! ముమ్మాటికీ లభించదు. ఐశ్వర్యంవల్ల ప్రపంచంలోని భౌతిక వస్తువుల సముదాయం వల్ల ఎంత సుఖం అనుభవింప కలుగుతావో అంత సుఖమే పొందగలుగుతావు. ధనం అమృతత్వాన్ని పొందింపజేసే ఆశగాని, అవకాశంగాని లేదు."

మైత్రేయి తిరిగి ఇలా అన్నది: "అయితే స్వామీ! నేను కోరుకొనే అమృతత్వాన్ని ఇవ్వని ఈ సంపదలు నాకెందుకు? శాశ్వతమైన, అమృతమయమైన జీవితాన్ని ప్రసాదించే జ్ఞానం నాకు కావాలి. నాకు ఆ అమృతత్వమే కావాలి. భౌతిక సంపదలను గురించి మాట్లాడడం కన్నా ఆధ్యాత్మిక విజ్ఞానఘనులైన మీరు నాకు ఆత్మవిజ్ఞానాన్ని ఉపదేశించండి. నామనస్సు ఆ ఆత్మజ్ఞానమందే లగ్నమై ఉన్నది. మిగిలినదంతా నాకనవసరం."

యాజ్ఞవల్క్య మహర్షి భార్య జిజ్ఞాసకు సంబర పడ్డాడు. మైత్రేయిని దగ్గరకు తీసుకొన్నాడు. ప్రేమతో ఇలా చెప్ప నారంభించాడు: "మైత్రేయీ! నా హృదయంలో నిండి ఉన్న విజ్ఞానాన్ని గురించి ప్రశ్నించి, నా హృదయానికి



# ఆనాడు

వి. రాజగోపాలరావు

మరలిరాదానాడు!
మఱువలేనినాడు!
మురియు పసిపాపనై
పరువులెత్తిననాడు
మరులలో విరివోలె
మురువు సూపిననాడు,
చిరునవ్వు సిరులెల్ల
ధరణి జిల్కిననాడు.

జీవనప్రాభాత
నవ్యకాంతిస్థగిత
జగతిలో చిన్నారి
సొగసులీనిననాడు.

నాసూత్మ సామ్రాజ్య
విశ్వంభరాపీఠి
నెదురెవ్వరును లేని
ముదమునొందిననాడు.

ఈర్ష్యా జుగుప్స వి
ద్వేష వైషమ్యాధి
కాకావిలములచే
గాసినొందనినాడు.

జీవసంభరణంబు
భావించి బ్రతుకులో
అనుదినము అగచాట్ల
ననుభవింపనినాడు.

కలతనొందిన మనో
నిలయాంతరమ్ములో
ఆశాంకురంబునై
మోసులెత్తిననాడు.

శాంతి సంతోష సం
క్రాంతి నిండిననాడు,
ఏడ్పునవ్వులు మదిన్
గాడ్పు రేపనినాడు.
మఱువజాలని మోద
ఝరులు పాఱిననాడు!

ఆనాడు! ఆనాడు!
కావలేనినాడు!
అదియె నాచరితలో
మధుర స్వర్ణయుగంబు!
స్మృతిపథాంతరములో
అతుల కాంతియుగంబు!
మఱువలేనానాడు!
మరలిరాదీనాడు!

ఇంకా దగ్గరకు వచ్చావు. నాకు తెలిసినంతవరకు నీకు చెబుతాను. జాగ్రత్తగా విను. మనస్సును నిశ్చలం చేసుకో. చెప్పిన విషయాలపై ధ్యానం నిలుపు. అన్నీ కరతలామలకం అవుతాయి."

మహర్షి తన సందేశం ప్రారంభించాడు: "మైత్రేయీ! మనం ఈ ప్రపంచంలో భార్య భర్తనూ, భర్త భార్యనూ ప్రేమించుకోవటం చూస్తూ ఉన్నాం. నిజం ఆలోచిస్తే భార్య కోసమే భర్త ఆమెను ప్రేమిస్తున్నాడని కాని, భర్తకోసమే భార్య అతడిని ప్రేమిస్తున్నదనికాని చెప్పలేం. భర్తగాని, భార్యగాని తమను తామే ప్రేమించుకొంటారు. అంటే తమ ఆత్మలను తామే ప్రేమించుకొంటారు. కాబట్టి ఈప్రేమ ప్రదర్శన 'ఆత్మ'కోసమే. అలాగే పిల్లలమీద ప్రేమకూడ. భార్యను, భర్తను, పిల్లలను, ధనాన్ని, దేవతలను అన్నిటిని ప్రేమిస్తున్నామంటే మన ఆత్మను వాటిల్లో చూచుకొనగలగడం మూలాన అలా ప్రేమించ గలుగుతున్నాం. మనం వేదాలను ప్రేమిస్తున్నాం. అంటే ఏమిటి? అవి మన అజ్ఞానాన్ని పోగొడుతాయి కాబట్టి, ఆత్మజ్ఞానాన్ని కలిగిస్తాయి కాబట్టి వాటిని నమ్ముతున్నామన్నమాట. ఆత్మను ప్రేమించుకోవటం మూలాన అన్నీ మనకు ప్రేమపాత్రము లౌతాయి. ఇది మూలసూత్రం.

"ఓ మైత్రేయీ! ఆ ఆత్మను అనుభవించాలి. ఆ ఆత్మను గురించే వినాలి. ఆ ఆత్మను గురించే మననం చేయాలి. ఆత్మజ్ఞానం కలిగితే అన్నిటి జ్ఞానం వచ్చినట్లే. కనిపించేదానిలో, కనిపించని దానిలో అంతటా ఆత్మ ఉన్నది కాబట్టి, అది తెలిస్తే అన్నీ తెలిసినట్లే.

"నగారా మ్రోగించారనుకో. దానిలోనుంచి ఎన్నో శబ్దతరంగాలు ఉత్పన్నమై ప్రసారమౌతాయి. వీణ వాయించినప్పుడు ఎన్నో మధుర స్వరాలను ఆ తంత్రులు పలుకుతాయి. నగారా వద్దకు వెళ్ళి, వీణ చేతపట్టి ఎన్ని రకాలైన ధ్వనులనైనా వాటిల్లోనుంచి పుట్టించవచ్చు. అలాగే ఆత్మజ్ఞానం కలిగితే విశ్వవిజ్ఞానమంతా మనదే అవుతుంది.

"భూమిమీది నీళ్ళన్నీ సముద్రంలోనికి పోతూ ఉంటాయి. అలాగే మన కళ్ళతో చూచినవి, చెవులతో విన్నవి, ముక్కుతో వాసన చూచినవి, ఒంటితో తాకినవి, మనస్సుతో భావించినవి అన్నీ ఒక మూల విశ్రామ స్థలానికి వెళ్ళుతాయి. ఆ స్థానమే ఆత్మ. అది లేకపోతే ఇంద్రియాలు పనిచెయ్యటం మానేస్తాయి. మనస్సు ఏమీ ఆలోచించలేదు.

"ఆ ఆత్మ చనిపోయిన తర్వాత ఉండదని కొందరంటున్నారు."

యాజ్ఞవల్క్యుడు ఇలా చెప్పుకొనిపోతూంటే మైత్రేయి అర్థం చేసుకొనలేక పోయింది. "స్వామీ! మీరు చెప్పేమాటలు నాకు సందేహం కలిగిస్తున్నాయి. ముఖ్యంగా మరణానంతరం ఆత్మచైతన్యం ఉండదన్నారే, అదేమిటో నాకు అర్థం కావడంలేదు. నాకు వివరంగా చెప్పండి" అని అన్నది.

యాజ్ఞవల్క్యుడు అన్నాడు: "మైత్రేయీ! ఒక్కమాట విను. ఆత్మ ఒక్కటే అని చెప్పాను. రెండుగా ఉంటేనే కదా ఒకదాని మరొకటి చూడడం సంభవిస్తుంది. ఒకదాని మరొకటి వినడం సంభవిస్తుంది. ఒకదాని గురించి మరొకటి ఆలోచించడం సంభవిస్తుంది. అంతా ఆత్మే వ్యాప్తమై ఉన్నప్పుడు, అన్ని రూపాలలో తానే ఉన్నప్పుడు ఎవడు ఎవడిని చూస్తాడు? ఎవరు ఎవరిని వింటారు? ఎవరు ఎవరిని తెలుసుకొంటారు?

"అందువల్ల ఆత్మానుభవంలో అనేకం లేవు. అది రెండుగా లేదు. అది ఏకైకతత్త్వం. ఇది పరమసత్యం. తెలియబడేవాడు, తెలుసుకొనే వాడు ఆ ఆత్మేఅయి ఉండగా దానిని ఏమార్గంలో తెలుసుకోవడమనే ప్రశ్న ఎలా పుడుతుంది, మైత్రేయీ?" అని మహర్షి తన ఉపదేశ వాక్యాలు ముగించాడు.

యాజ్ఞవల్క్య మహాముని మైత్రేయికి అలా ఆత్మవిజ్ఞానం ఉపదేశించి అరణ్యాలకు నిష్క్రమించాడు.

*(బృహదారణ్యకోపనిషత్తునుంచి)*